
సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 18 । జూన్ । 2023



ప్రపంచానికి మనల్ని చూపేది అమ్మ.. ప్రపంచాన్ని మనకు చూపేది నాన్న. అమ్మ జన్మనిస్తే.. నాన్న ఆ జన్మకు రూపమిస్తారు. తల్లి అంటే ఎంత ప్రేమో...తండ్రి అంటే కూడా అంతే ప్రేమ. నాన్న గంభీరంగా ఉంటారు.. అందుకే పిల్లలు నాన్నకు భయపడతారు. కానీ.. నాన్నకు ఏదైనా ఇబ్బంది వస్తే మాత్రం పిల్లలు సెకను కూడా ఆగలేరు. అదే పిల్లలకు, నాన్నకు మధ్య ఉన్న అనుబంధం. తండ్రి పిల్లల కల నెరవేర్చడానికి కష్టపడుతుంటారు. ఎన్నో త్యాగాలు చేసి పిల్లల మొహంలో సంతోషాన్ని నింపాలనుకుంటారు. అదే నాన్న గొప్పతనం. నేడు ఫాదర్స్ డే.. ఈ సందర్భంగా నాన్నతో పలువురి బంధం.. అనుబంధం..

నాన్న

నాన్న కష్ట జీవి



సాక్షిప్రతినిధి కరీంనగర్/కరీంనగర్: మాది వెల్గటూర్ మండలం పైడిపల్లి. వ్యవసాయక కుటుంబం. నాన్న గంగుల మల్లయ్య పటేల్. వ్యవసాయం, కాంట్రాక్ట్ పనులు చేయించేది. నలుగురు అన్నదమ్ములమైన మమ్మల్ని ఉన్నతంగా చదివించాలని ఆరాటపడేవారు. గ్రామంలో ఎవరికీ ఏ ఆపద వచ్చినా.. డబ్బులు సర్దుబాటు చేసేవారు. నాన్న ప్రోత్సాహంతో రాజకీయాల్లో చేరి 25ఏళ్లుగా కౌన్సిలర్, కార్పొరేటర్, ఎమ్మెల్యే, మంత్రిగా ప్రజాసేవ చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. నాన్న పేరు నిలబెట్టాననే ఆనందం ఉంది.

– గంగుల కమలాకర్, రాష్ట్ర మంత్రి

పుస్తక పఠనంపై ఆసక్తి



సాక్షిప్రతినిధి కరీంనగర్/కరీంనగర్: నాన్న జననేషన్ వీరరాఘవన్ కవి. ఉద్యోగ రీత్యా లైబ్రేరియన్ కావడంతో నాకు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనంపై ఆసక్తి. నాన్న రాసిన కథల నుంచి స్ఫూర్తి పొంది చదువుపై మమకారం పెరిగింది. నాన్న చూపిన చొరవ నన్ను సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడానికి దోహదపడింది. – ఆర్వీ కర్ణన్, కరీంనగర్ కలెక్టర్

జీవిత గురువు



జగిత్యాల: నాన్న మాకునూరి హన్మంతరావు 63ఏళ్లుగా న్యాయవాదిగా పనిచేశారు. ఆయనే నా తొలిగురువు. నాన్న ప్రోత్సాహంతోనే వైద్య, రాజకీయ రంగంలోకి వచ్చా. నాన్నకు వ్యవసాయమంటే మక్కువ. ఆయన ఆలోచనకు అనుగుణంగా మెడిసిన్ పూర్తి చేసి నేత్రవైద్యుడిగా ఇప్పటివరకు 30వేల మందికి పైగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేశాను. ఎమ్మెల్యేగా ఎంతబిజీగా ఉన్నా వైద్య వృత్తిని కొనసాగిస్తున్నా. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా సాయంత్రం కాసేపు నాన్నతో మాట్లాడితే ఒక స్నేహితుడితో మాట్లాడిన ఫీలింగ్ ఉంటుంది. నాన్నే నాకు ఆత్మీయ మిత్రుడు.

– సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

ప్రోత్సాహం మరువలేనిది



నాన్న సత్యనారాయణమూర్తి ఎస్‌బీఐలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. కుటుంబ బాధ్యతలు అన్ని భుజాన వేసుకున్నారు. కష్టపడి అందరినీ ప్రయోజకులను చేశారు. నన్ను డాక్టర్ కావాలని సూచించేవారు. ఇంజినీరింగ్‌పై ఆసక్తితో నేను బీటెక్ పూర్తి చేసి.. గ్రూప్స్‌రాసి ఉద్యోగం సాధించాను.

– ప్రియాంక, జెడ్పీ సీఈవో, కరీంనగర్

నాన్నే స్ఫూర్తి



నాన్న సుగుణాకర్‌రావు అలియాస్ రాజేశ్వరరావు వృత్తి రీత్యా కాంట్రాక్టర్. చిన్నప్పటి నుంచే నాన్నలోని ముక్కు సూటితనం, ధైర్యం సేవా గుణం ఆకట్టుకుంది. చదువుకుంటున్న సమయంలోనే నాకు రాజకీయ లక్షణాలు వచ్చాయి. 20 ఏళ్లుగా రాజకీయ పదవులలో కొనసాగుతూ ప్రజలకు సేవ చేసే విషయంలో నాన్నే స్ఫూర్తి.

– వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

బట్టలు కుట్టి..



పాలకుర్తి: నాన్న దర్జీ పని చేస్తూ చదివించారు. ప్రస్తుతం భౌతికంగా లేకపోయినా.. ఆయన ఆలోచన విధానాలు మా వెంటే ఉన్నాయి. బసంత్‌నగర్‌లో నాన్న పరికిపండ్ల సత్యనారాయణ స్మారకార్థం ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి పేదలకు సేవ చేస్తున్నాం.

– పరికిపండ్ల నరహరి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఐఅండ్ పీఆర్ కమిషనర్

కొండంత అండ



సాక్షి, పెద్దపల్లి: నాన్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ. రాజకీయాల్లో బిజీగా ఉన్నా నాకోసం రోజూ కొంత సమయం కేటాయించేవారు. బాల్యంలో చదువు నిర్లక్ష్యం చేయవద్దని కొంత కఠినంగా చెప్పినా, ఉన్నత చదువులు, వృత్తిని ఎంచుకునే సమయంలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. నాన్న నాకు మంచి స్నేహితుడు, అంతకు మించి విమర్శకుడు. నేను ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తరువాత మనం ఒకప్పుడు పేదవాళ్లమే.. సాయం కోసం నీ దగ్గరకు వచ్చే వారితో సొంత మనిషిలా వ్యవహరిస్తూ.. సమస్య పరిష్కరించడానికి ప్రయత్నించాలని చెప్పారు. ఇప్పటికీ నాన్న ఇచ్చే సలహాలనే పాటిస్తా.

– డాక్టర్ సంగీత సత్యనారాయణ, కలెక్టర్ పెద్దపల్లి

నాన్న నుంచే కష్టపడే తత్వం..



సిరిసిల్లక్రైం: నాన్న రాకేశ్‌కుమార్ గుప్తా. కిరాణం నడిపేవారు. ఉదయం 6 నుంచి రాత్రి 10గంటల వరకు షాపు నడపడం చూశా. సామాజిక సేవకు నాన్నే గురువు. తనతో సంతోషంగా గడిపిన రోజులు చాలా ఉన్నాయి. నేను ఐపీఎస్‌కు ఎంపికయ్యాక నాన్నతో కలిసి దిగిన ఫొటో నేనెప్పుడూ మరిచిపోలేను.

– అఖిల్ మహాజన్, ఎస్పీ, రాజన్న సిరిసిల్ల

నాన్న మాటలే దారి చూపాయి



సాక్షిప్రతినిధికరీంనగర్/కరీంనగర్: నాన్న లక్ష్మయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఇంటినుంచి వెళ్లాలంటే కలెక్టర్ కార్యాలయం ముందు నుంచే వెళ్లేవారు. కలెక్టర్ అంటే జిల్లాకు అధికారి అని ఏ పని అయిన చేయవచ్చనని నాన్న ఇతరులతో మాట్లాడే సందర్భాలు నన్ను కదిలించాయి. ప్రతీరోజు దినపత్రికలు చదివే నాన్నను చూసి నేనూ పేపర్లు చదివేవాడిని. ఆయన స్ఫూర్తితోనే సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించాను.

– ఆవుల సాయికృష్ణ, సివిల్స్ ర్యాంకర్, కరీంనగర్

బడిలో..ఇంట్లో పాఠాలే చెప్పారు



కోరుట్ల: నాన్న అంజిరెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. వ్యవసాయం కూడా ఉండడంతో పొలం, స్కూల్ రెండూ చూసుకునేవారు. మేము చదువుపై దృష్టి పెట్టేలా శ్రద్ధ తీసుకునేవాడు. ప్రభుత్వ టీచర్ అయినా జీతం తక్కువే . అమ్మ పుష్పలత వ్యవసాయ పనులు చూస్తూ ఉండటం.. వచ్చే డబ్బులతో నా చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. సివిల్స్ ఫలితాలు వచ్చిన రోజు నేను ఢిల్లీలోనే ఉన్న. నాన్నకు ఫోన్ చేసి 132వ ర్యాంకు వచ్చిందని చెప్పగానే ఉద్వేగంతో..'కంగ్రాట్స్'అన్నారు. నాన్న కల నెరవేర్చానన్న తృప్తి మిగిలింది.

– ఏనుగు శివమారుతిరెడ్డి, సివిల్స్ ర్యాంకర్, కోరుట్ల

సజ్జలు అమ్మి చదివించారు



సిరిసిల్ల: మాది నల్గొండ జిల్లా దేవరకొండ మండలం గాజినగర్. అమ్మ పార్వతి, నాన్న మాన్యానాయక్. నలుగురం అన్నదమ్ములం, ఐదుగురు అక్కలు. నేను చిన్నోడిని. నన్ను చెల్లెను మాత్రమే చదివించారు. నాన్న వ్యవసాయం చేసేవారు. నీటి వసతి లేని భూమి ఉండేది. మా ఊరి దగ్గర పెళ్లిపాకాల చెరువులో చేపలు పట్టేవారు. నేను దేవరకొండలో హాస్టల్‌లో ఉండి చదువుకున్న. ఇంటర్ బైపీసీలో సైన్స్‌బాక్స్ కొనేందుకు డబ్బులు లేకపోతే ఇంట్లోని సజ్జలు అమ్మారు. నాకు వ్యవసాయ పనులు నేర్పించారు. డిగ్రీ కాగానే స్పెషల్ టీచర్‌గా పని చేశా. ఆర్టీసీ కండక్టర్‌గా, గోదాం మేనేజర్‌గా చేశా. 1995లో గ్రూప్–2 ద్వారా రెవెన్యూశాఖలో ఉద్యోగం వచ్చింది. నేను తహసీల్దార్‌గా ఉండగా.. 2007లో నాన్న చనిపోయారు. నేను ఈ రోజు ఈ స్థాయికి వచ్చానంటే నాన్న చలువే.

– నేనావత్ ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్, రాజన్న సిరిసిల్ల



తండ్రి జ్ఞాపకంగా విగ్రహం

జమ్మికుంట: ఇప్పటివరకు రాజకీయనాయకులు.. ఉన్నతమైన వ్యక్తులకు మాత్రమే విగ్రహాలు ఏర్పాటు చేయడం చూశాం. కానీ.. ఓ తండ్రి చనిపోతే.. ఆయన జ్ఞాపకంగా విగ్రహం ఏర్పాటు చేశారు అతని పిల్లలు. అక్కడే ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు. జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన పొట్లపల్లి జయరామారావు పట్వారి. పట్వారి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశాడు. తెలంగాణ తొలి ఉద్యమ సమయంలో రాజకీయాల్లోకి వచ్చారు. జమ్మికుంట జెడ్పీటీసీగా పనిచేశాడు. మూడేళ్లక్రితం అనారోగ్యంతో చనిపోయాడు. ఆయన కొడుకు పొట్లపల్లి శ్రీధర్‌బాబు, కూతురు కంకటి శ్రీదేవి వ్యవసాయక్షేత్రం జయరామారావు విగ్రహం ఏర్పాటు చేశారు. ఏటా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నారు.

మా ఫాదర్ గ్రేట్



కోల్‌సిటీ(రామగుండం): మా నాన్న బుచ్చి రాజం. నాతో ఫ్రెండ్‌లా ఉంటారు. హిందీ టీచర్‌గా పని చేసి రిటైర్ అయ్యారు. ఇప్పుడు 82 ఏళ్లు. నాన్న నన్ను డాక్టర్ చేయాలనుకున్నారు. కానీ బీటెక్ చేసి, మున్సిపల్ కమిషనర్ అయ్యా. ప్రయోజకుడివయ్యావని అభినందించారు. ఇంత వయసొచ్చినా నాన్నకు ఇంకా నేను పిల్లాడినే. 1991లో హైదరాబాద్ జేఎన్‌టీయూలో బీటెక్ చదువుతున్న సమయంలో ఒకరోజు జగిత్యాలలోని మా ఇంట్లో భోజనం తయారు చేసి బస్సులో పట్టుకొచ్చాడు. కాసేపు మాట్లాడితే సంతృప్తిగా ఉంటుంది. మా ఫాదర్ గ్రేట్.

– బి.సుమన్‌రావు, కమిషనర్, రామగుండంనగరపాలక సంస్థ

కిడ్నీ ఇచ్చి బతికించారు



మాది గోదావరిఖనిలోని రమేశ్‌నగర్. ప్రస్తుతం కర్నాటకలో బళ్లారిలోని ఓ స్టీల్ కంపెనీలో సీనియర్ మేనేజర్‌గా ఉద్యోగం చేస్తున్న. నాన్న కిష్టయ్య సింగరేణిలో పని చేసి రిటైర్ అయ్యారు. నాకు 2004లో కిడ్నీలు చెడిపోయాయి. ఎవరైనా కిడ్నీ దానం చేస్తే తప్ప బ్రతకడం కష్టమని డాక్టర్లు చెప్పారు. దీంతో నాన్న, అమ్మ సుశీల ఆర్థికంగా, మానసింగా చాలా కష్టపడ్డారు. ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై ఉన్న నాకు కిడ్నీదానం చేయడానికి నాన్న ముందుకు వచ్చారు. చాలా మంది వద్దని వారించారు. కానీ నా కొడుకు బతుకు ముఖ్యమంటూ కిడ్నీఇచ్చి నన్ను బతికించుకున్నాడు.

– పోతర్ల జయాకర్ రాజు, సీనియర్ మేనేజర్, బళ్లారి, కర్నాటక

న్యూస్‌రీల్

పల్లె దవాఖానా పరిశీలన



పల్లె దవాఖానాను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరంలోని పల్లె దవాఖానాను జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు శనివారం తనిఖీ చేశారు. ఈ పల్లె దవాఖానాకు డాక్టర్ విక్రమ్‌ను కేటాయించినట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన



అగ్రహారంలో విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న లెక్చరర్లు

వేములవాడఅర్బన్: అగ్రహారం ఎస్సార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని పాలిసెట్ ప్రవేశపరీక్షలో ర్యాంకులు సాధించిన అభ్యర్థుల కౌన్సిలింగ్ శనివారం ప్రారంభమైనట్లు కాలేజీ ప్రిన్సిపాల్ బి.రాజగోపాల్ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తొలి రోజు 230 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు తెలిపారు. కౌన్సిలింగ్ సోమవారం వరకు కొనసాగుతుందని చెప్పారు. పాలిసెట్ కౌన్సిలింగ్ లెక్చరర్లు సాగర్, కృష్ణమనోహర్, రాములు, రవీందర్, వహీద్, కిరణ్‌కుమార్ ఉన్నారు.

గిరిజనుల సంక్షేమమే లక్ష్యం





దేవునితండాలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు. బుగ్గరాజేశ్వర తండాలో గిరిజనులకు సన్మానం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- మార్పుతోనే స్వయం పాలన
- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్
- జిల్లాలో ఘనంగా గిరిజనోత్సవాలు

చందుర్తి/కోనరావుపేట(వేములవాడ)/ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల): గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా జిల్లాలోని తండాలు, తండాపంచాయతీలలో శనివారం గిరిజనోత్సవం నిర్వహించారు. తండాలకు వచ్చిన అతిథులకు సాంస్కృతిక నృత్యాలతో స్వాగతం పలికారు. గిరిజన ప్రజాప్రతినిధులను సన్మానించారు. చందుర్తి మండలం దేవునితండా జీపీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడారు. గిరిజనుల రిజర్వేషన్‌ను ఆరు నుంచి పది శాతానికి పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడకముందు దేవుని, జలపతి తండాలవాసుల సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు జర్మనీ నుంచి రూ.100 కోట్లు తీసుకొచ్చి ఎర్ర, పటేల్ చెరువులను అనుసంధానించినట్లు తెలిపారు. త్వరలోనే పోడు భూముల సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. జెడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీపీ బైరగోని లావణ్య, సర్పంచ్ పంతులునాయక్ , చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, యూత్ అధ్యక్షుడు గబ్బర్‌సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన దినోత్సవం

కోనరావుపేట మండలంలోని జైసేవాలాల్ భూక్యారెడ్డితండాలో గిరిజన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గిరిజనులు ర్యాలీగా తరలివెళ్లి సేవాలాల్ మహారాజ్, జగదాంబ ఆలయాల వద్ద బోగ్ భండార్ నిర్వహించారు. అజ్మీరాతండా, ఊరుతండా, కమ్మరిపేటతండా గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. సర్పంచులు లకావత్ ప్రమీల, రాములు, ఎంపీపీ చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో శ్రీనివాస్, ఎంపీటీసీ రేణుక పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలతో స్వయం పరిపాలన

తండాలను పంచాయతీలుగా మార్చడంతోనే గిరిజనులకు స్వయం పరిపాలన సాధ్యమైందని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో నిర్వహించిన గిరిజనోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. జిల్లాలోని 25 తండాలు గ్రామపంచాయతీలుగా మార్పు చెందాయని, దీని ద్వారా గిరిజనులకు స్వయం పరిపాలన సాధ్యమైందన్నారు. స్థానికులు గ్రామాలను పాలిస్తే సమస్యలపై అవగాహన ఉండి, పరిష్కరించుకోగలుగుతారన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించేందుకు రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ అజ్మీరా రజిత, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో వజీర్ పాల్గొన్నారు.

జీపీలుగా 25 తండాలు

జిల్లాలోని 25 తండాలు నేడు గ్రామపంచాయతీలుగా మారాయని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండాలో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత పదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని అందరికీ తెలిపేలా రోజుకో కార్యక్రమంతో ఉత్సవాలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. తండాలు గ్రామ పంచాయతీలుగా మారిన తర్వాత అనేక మార్పులు వచ్చాయన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు బాగుపడ్డాయన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షిస్తుందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జెడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీడీవో నరేశ్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, సర్పంచ్ జగ్మాల్ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి పెద్దపీట



ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న తోట ఆగయ్య

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య
- 20న మోడ్రన్ పాఠశాలను ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్
- విద్యా దినోత్సవంలో భాగస్వాములు కావాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం మనఊరు-మనబడితో విద్యారంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట ఉన్నత పాఠశాలలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రూ.8కోట్లతో నిర్మించిన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల సమీకృత భవన సముదాయాలను ఈనెల 20న మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మండలానికో మాడ్రన్ పాఠశాల నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుపోతుందన్నారు. రాష్ట్ర స్థాయిలోనే మొట్టమొదటిగా గంభీరావుపేటలో కేజీ టు పీజీ భవన సముదాయాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సిరిసిల్ల గీతానగర్, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేటల్లో రూ.8కోట్ల చొప్పున వెచ్చించి ఆధునిక సదుపాయాలతో సమీకృత భవనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. 24 గంటల విద్యుత్, ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, రైతుబంధు, రైతుబీమా, చేనేత, దళితబంధు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఎల్లారెడ్డిపేట పాఠశాల ప్రారంభానికి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రస్తుత విద్యార్థులు, గ్రామస్తులు సకాలంలో హాజరై విద్య విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవం రోజునే పాఠశాలను ప్రారంభించుకోవడం గొప్ప విషయమన్నారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు పందిర్ల నాగరాణి, ఎలగందుల అనసూయ, హెచ్‌ఎం హన్మండ్లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కాంటాక్ట్ కమ్యూనిటీ



మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

బోయినపల్లి(చొప్పదండి): నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో గ్రామాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు వేములవాడ డీఎస్పీ నాంగేద్రచారి పేర్కొన్నారు. మండలంలోని బూర్గుపల్లిలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామస్తులతో డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సరైన పత్రాలు లేని 66 బైకులు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. సీఐ బన్సీలాల్, ఎస్సైలు మామిడి మహేందర్,ప్రభాకర్, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల ఇళ్ల జోలికి వస్తే సహించం



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్ల అర్బన్: నిరుపేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని ఈదుల చెరువు సమీపంలో నివాసముంటున్న కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోగా ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి అన్ని పన్నులు వసూలు చేస్తున్నారని, ప్రస్తుతం వీరు ఉంటున్న 84 ఇళ్లకు అధికారులు రెడ్‌మార్క్ వేసి బఫర్ జోన్‌గా ప్రకటించడం సరికాదన్నారు. రాజీవ్‌నగర్ శివారులో వందల ఎకరాలు అన్యాక్రాంతమైనా పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ కరకట్టను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పట్టణ కార్యదర్శి పంతం రవి, సోమ నాగరాజు, లక్ష్మణ్, శ్రీనివాస్, తదితరులున్నారు.

మధ్యాహ్న కార్మికుల బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న రాములు

సిరిసిల్లటౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే కార్మికుల పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అజ్జ వేణు, నల్ల చంద్రమౌళి, మీస లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

సిరిసిల్ల అర్బన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను పలు సబ్జెక్టులకు పార్ట్ టైం పద్ధతిలో బోధించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జాక్వలిన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం చిన్న బోనాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముస్తాబాద్, బద్దెనపల్లి, వేములవాడ, ఇల్లంతకుంట తదితర మండలాల పాఠశాలల ప్రిన్సిపాల్స్ ఉన్నారు.

ఇల్లే లేదు.. పన్ను రశీదు

- ఇల్లు లేకున్నా ఇంటి పన్ను!
- ఆ రశీదుతో విద్యుత్ మీటర్
- అధికారుల మాయాజాలం
- విస్మయం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

రుద్రంగి(వేములవాడ): పైసలిస్తే.. కాని పనిలేదు అన్నట్లుగా ఉంది మండలంలోని కొందరి అధికారుల తీరు. ఇల్లు లేకున్నా ఇంటి నెంబర్‌తో ఇంటి పన్ను కట్టినట్లు గ్రామ పంచాయతీ అధికారులు రశీదు ఇవ్వగా ఎలాంటి విచారణ చేపట్టకుండానే గ్రామ పంచాయతీ వారు లేని ఇంటికి విద్యుత్ అధికారులు విద్యుత్ మీటర్ సాంక్షన్ చేశారు. ఆ మీటర్‌ను వీధిలోని విద్యుత్ స్తంభానికి పెట్టడంతో విషయం బయటికి తెలిసి అధికారుల మాయాజాలానికి గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు సరిగా ఉన్నా చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోని అధికారులు అసలు ఇల్లే లేకుండా ఇంటి నెంబర్ ఇచ్చి దానికి పన్ను వసూలు చేయడంలో ఉన్న ఆంతర్యమేమిటోనని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఏదో పథకం ప్రకారమే ఇదంతా చేస్తూ పెద్దమొత్తంలో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎందుకు చేశారంటే..?

ఇల్లు లేకున్నా ఇంటినెంబర్‌పై పన్ను చెల్లించిన వ్యక్తికి సంబంధించి ఇంటిని నిర్మించే విషయంలో మరో వ్యక్తితో గొడవ జరిగింది. ఇంటి నిర్మాణ స్థలం తమదంటే తమదని వాదించుకొని పోలీస్‌స్టేషన్‌కు వరకు వెళ్లారు. ఆ కేసు ఇప్పుడు కోర్టులో ఉంది. లేని ఇంటికి ఎప్పట్నుంచో ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లించినట్లు చూపిస్తే దాంతో విద్యుత్ మీటర్ తీసుకుంటే కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని, అందుకే అధికారులను మచ్చిక చేసుకొని ముడుపులు ముట్టజెప్పి ఉంటారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇల్లుకు ఇంటినెంబర్ తీసుకొని, పన్ను చెల్లిస్తూ, ఆ రశీదుతో విద్యుత్ మీటర్ తీసుకున్నారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.



లేని ఇంటికి విద్యుత్ మీటర్ సాంక్షన్ చేసిన విద్యుత్ అధికారులు



ఇంటి పన్ను కట్టినట్లు ఇచ్చిన రశీదు

గతంలోనూ ఇలాగే..

అధికారులు, అక్రమార్కులు కలిసి దొంగ ఇంటి నెంబర్, విద్యుత్ మీటర్‌తో గతంలో ఓ నిరుపేద కుటుంబాన్ని కూడా ముంచారని, లక్షల విలువ చేసే వారి సొంత భూమిని కూడా లాక్కున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు, అక్రమార్కులను ఏమీ చేయలేని ఆ నిరుపేద కుటుంబం నీడ వేసుకునేందుకు ఉన్న కొంతభూమిని సైతం వదిలేసుకున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరుతున్నారు.

కన్‌స్ట్రక్షన్ పర్పస్‌లో ఇవ్వొచ్చు

కన్‌స్ట్రక్షన్ పర్పస్‌లో క్యాటగిరి 2 కింద ఓపెన్ ప్లాట్స్‌కు కూడా విద్యుత్ మీటర్ సాంక్షన్ ఇవ్వొచ్చు. ఇంటి నెంబర్ ఉండడంతో ఎలాంటి ఆబ్జక్షన్ లేకుండా విద్యుత్ మీటర్ సాంక్షన్ చేశాం.

– రాకేశ్ రెడ్డి, ఇన్‌చార్జ్ సెస్ ఏఈ, రుద్రంగి

ఇంటి నంబర్‌ను తొలగిస్తాం

ఇంతకుముందు విధులు నిర్వహించిన కార్యదర్శి ఇంటినెంబర్ జారీచేశారు. పంచాయతీ రాజ్ చట్టానికి విరుద్ధంగా ఇంటి నెంబర్ అలాట్ చేస్తే ఇంటి నెంబర్ తొలగిస్తాం.

– రాందాస్, కార్యదర్శి, రుద్రంగి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎప్పుడో?

- ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ రంజిత్‌కుమార్
- కళాశాల ఏర్పాటుపై కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని, కళాశాల ఏర్పాటు కల నిజమయ్యేదెప్పుడోనని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. కళాశాల ఏర్పాటుపై శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. రంజిత్‌కుమార్ మాట్లాడుతూ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ ఎనిమిదేళ్ల క్రితం హామీ ఇచ్చారని.. ఇప్పటికీ అమలుకాలేదన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఏటా 2 వేల మంది విద్యార్థులు ఇంటర్ పూర్తి చేస్తున్నారని, స్థానికంగా డిగ్రీ కళాశాల లేక సగం మంది విద్యార్థులు చదువును మధ్యలో నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ శివ, నాయకులు నవీన్, విష్ణు, హేమంత్, సూరజ్, నవదీప్, భాను, వెంకటేశ్, వంశీ, మనోజ్, వినయ్, తిరుపతి, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లింగోజి, నాయకులు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వం విద్యా విధానాలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తుందని రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షల ఇన్‌చార్జి లింగోజి పేర్కొన్నారు. శనివారం సిరిసిల్ల డీసీసీ ఆఫీస్‌లో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా విద్యార్థులు, నిరుద్యోగులను విస్మరిస్తుందన్నారు. తెలంగాణ యువశక్తి మేధో సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడం, సంప్రదాయ విద్యపై దృష్టి సారించేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందించనున్నారని, యువత సద్వినియోగం చేసుకోవాలన్నా రు. పోటీల్లో 16 నుంచి 35 ఏళ్ల లోపు వారు పాల్గొనవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు జులై1 చివరి తేదీ అన్నారు. మరిన్ని వివరాలకు 76618 99899 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మడుపు శ్రీదేవి, సూర దేవరాజు, చోటు, సంగీతం శ్రీనాథ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుంది

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కే.కే.మహేందర్‌రెడ్డి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: అధికార పార్టీ బీఆర్‌ఎస్ నేతల్లో అప్పుడే ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఈమేరకు మంత్రి కేటీఆర్ సైతం నేను ఓడిపోతే ఎలా అని మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు బీఆర్‌ఎస్ నమ్మేతలేరని.. ఆ పార్టీ నాయకుల అరాచకాలను గమనిస్తున్నారన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో మంత్రి అనుచరులు పంచభూతాలను అవినీతికి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వానికి చరమగీతం పాడుతారన్నారు. కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మడుపు శ్రీదేవి, వెల్ముల తిరుపతిరెడ్డి, చొప్పదండి ప్రకాశ్, మునిగెల రాజు పాల్గొన్నారు.

ప్రజాదరణను ఓర్వడం లేదు

- కాలం చెల్లిన నేతలతో ఒరిగేదేమీ లేదు
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



మాట్లాడుతున్న న్యాలకొండ అరుణ

సిరిసిల్లటౌన్: తొమ్మిదేళ్లుగా రాష్ట్రం ప్రగతిపథంలో సాగుతుంటే వస్తున్న ప్రజాదరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో శనివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళ సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రజల ఉత్సాహాన్ని చూసి ప్రతిపక్షాలు తమ రాజకీయ పతనం ఖాయమైందన్న భయంతో వణికిపోతున్నాయని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ శని, ఆదివారాల్లో వచ్చే నాయకులు స్థాయి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో సర్కారు విద్యకు చెల్లుబాటు చెప్పగా.. తెలంగాణ ఏర్పడ్డాక కార్పొరేట్ విద్యను తలదన్నేలా ప్రభుత్వ బడులు నిలబడుతున్న విషయాన్ని గమనించాలని ప్రతిపక్షాలకు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీలకు నూకలు చెల్లాయని, రాబోయే కాలంలో బీజేపీకి అదే గతి పడుతుందని జోస్యం చెప్పారు. మంత్రి కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని కూతురు ఆత్మహత్య



మృతురాలు అంజుసాహు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తండ్రి మందలించాడని కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కవరాధా జిల్లా చిరుపానికి చెందిన అర్జున్‌రాం సాహు అనే వ్యక్తి మండలంలోని రాచర్లగొల్లపల్లిలో భవన కార్మికునిగా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులు నెల రోజుల క్రితం రాచర్లగొల్లపల్లికి వచ్చారు. ఇంటి పనులు సరిగ్గా చేయడం లేదని తండ్రి కూతురు అంజుసాహు(14)ను మందలించాడు. తండ్రి మందలించడంతో 8వ తరగతి చదువుతున్న అంజుసాహు శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగింది. పురుగుల మందు తాగడంతో పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. చదువుకుంటున్న కూతురు సెలవుల్లో ఇక్కడికొచ్చి తనువు చాలించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం

వేములవాడ అర్బన్: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన దూలం రఘు (28) కువైట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా శనివారం స్వగ్రామానికి మృతదేహం చేరుకుంది. సుభాష్‌నగర్‌కు చెందిన దూలం కనకలక్ష్మి–పర్శరాం దంపతులకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పర్శరాం 28 ఏళ్ల క్రితమే మృతిచెందాడు. కొన్ని నెలల క్రితమే రఘు ఇంటికి వచ్చి మళ్లీ కువైట్‌కు వెళ్లాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో అక్కడ మృతిచెందగా శనివారం రఘు మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమచేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చక్రధర్ రెడ్డి



మాట్లాడుతున్న చక్రధర్ రెడ్డి

ముస్తాబాద్ (సిరిసిల్ల): ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కనమేని చక్రధర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతులకు పడిగాపులు తప్పడం లేదన్నారు. ఓ వైపు వానాకాలం ప్రారంభమైనా రైతుల ధాన్యం డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. దశాబ్ది ఉత్సవాల కోసం ఖర్చుచేస్తున్న అధికారులు.. రైతుల ధాన్యం డబ్బులు ఎందుకు జమచేయడం లేదన్నారు. రుణమాఫీని మాఫీ చేయడం లేదని, రైతులు వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సంతోష్‌రెడ్డి, ప్యాక్స్ డైరెక్టర్ దేవేందర్, మీస శంకర్, పప్పుల శ్రీకాంత్, ఉపేంద్ర, బండి శ్రీకాంత్, భాను తదితరులున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



రోదిస్తున్న బంధువులు, కుటుంబ సభ్యులు

వేములవాడ : పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని లాలపల్లికి చెందిన తేలు కనుకయ్య (50) తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెద్దమ్మ జంక్షన్ వద్ద ఎదురుగా బైక్‌పై వస్తున్న యువకుడిని తప్పించబోయే క్రమంలో ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కనుకయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే కనుకయ్య మృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను ఠాణాకు తరలించి డ్రైవర్ బానోతు తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో రైతు..



అనిల్‌రెడ్డి (ఫైల్)

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌కు చెందిన అనిల్ రెడ్డి (38) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం సాయంత్రం గుండెపోటుతో చనిపోయినట్లు తెలిపారు. అనిల్‌రెడ్డి పదేళ్ల క్రితం విలేకరిగా పనిచేశాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం, ఆటోను పట్టుకున్న పోలీసులు

సిరిసిల్లక్రైం : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కొండాపూర్ నుంచి సిరిసిల్లలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌కు గుంట సంయోల్ అనే వ్యక్తి 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు సీసీఎస్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. టీఎస్ 01 యూబీ 4798 నంబర్ గల ట్రాలీ ఆటోను కలెక్టరేట్ జంక్షన్‌లోని రగుడు చౌరస్తా వద్ద పోలీసులు పట్టుకున్నారు. సంయోల్‌ను అదుపులోకి తీసుకొని బియ్యం, ఆటోను సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు మారుతి, శ్రీకాంత్, రాజేశ్, తిరుపతి, మహిపాల్, శ్రీనివాస్, మహిపాల్, అక్షర్, సమీయొద్దీన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే మొబైల్ ఠాణా

- సీఐ కిరణ్‌కుమార్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీఐ కిరణ్‌కుమార్

కోనరావుపేట(వేములవాడ): ప్రజల సమస్యల పరిష్కారానికే మొబైల్ ఠాణా నిర్వహిస్తున్నట్లు సీఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నిమ్మపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. యువకులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, దీనికి దూరంగా ఉండాలని సూచించారు. కేసు నమోదైతే ఇబ్బందులు ఎదురవడంతో పాటు ఉద్యోగావకాశాలు కోల్పోతారన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలు మధ్యవర్తులను ఆశ్రయించొద్దన్నారు. ఐదు ఫిర్యాదులు రాగా ఒకటి పరిష్కరించారు. మిగతా వాటిని ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ కదిరె శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్ హయాంలోనే వేములవాడకు నిధులు

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే బైపాస్‌రోడ్డుకు, మినీస్టేడియం, ఫాజుల్‌నగర్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేశారని, ఇప్పటి వరకు ఫాజుల్‌నగర్ మినహా ఏ ఒక్క పని కూడా పూర్తి చేయలేదని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ విమర్శించారు. వేములవాడలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో ఇంటిపోరు తట్టుకోలేక అసహనంతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారన్నారు. ఆలయం నుంచి అప్పుచేసి బద్దిపోచమ్మ గుడికి నిధులు వెచ్చించిన విషయం ఈ ప్రాంతవాసులకు తెలిసినప్పటికీ అభివృద్ధి పరచామంటూ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఏటా రూ.100 కోట్లు తెస్తానని.. తర్వాత ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో వేములవాడ ఒక్కటే వెనుకబడిపోయిందన్నారు. సాగారం వెంకటస్వామి, చిలుక రమేశ్, సంగ స్వామియాదవ్, పాత సత్యలక్ష్మి, నాగుల విష్ణు, కనికరపు రాకేశ్, నాగుల రాము, కూర దేవయ్య, శ్రీనివాస్‌గౌడ్, మామిడాల శ్రీకాంత్, రాజు, కిరణ్, నరేశ్, గడ్డం రేణుక తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ జనగామ మల్లేశ్ మూడు రోజుల క్రితం బెల్లంపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువాలోని రూ.10 వేలు, రూ.40 వేలు విలువ చేసే ముప్పావు తులం బంగారాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గతంలో కాల్వశ్రీరాంపూర్‌లో కోలేటి రాజబాబు తాళం వేసి ఊరెళ్లిన సమయంలో దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న నగలు, టీవీ ఎత్తుకెళ్లారు. మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ ఇంట్లో ఇదేరీతిన దొంగలు దోచుకెళ్లా రు. ఎవరైనా తాళం వేసి ఊరెళ్లినప్పు డు ఇరుగుపొరుగు వారికి చెప్పాలని, వచ్చే వరకు పక్కింటివా రి ని ఇంట్లో పడుకోవాలని చెప్పాలని ఎస్సై సూచించారు.

గోశాలకు రాజన్న కోడెలు



కోడెలు అందజేస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్: రాజన్న కోడెలను జనగామ జిల్లా కొడకండ్లలోని యాకన్న గోశాలకు, హన్మకొండ జిల్లా వనమలకనపర్తిలోని జై దుర్గ గోశాలకు 20 చొప్పున అందజేశారు.

బీసీలందరికీ రూ.లక్ష వర్తింపజేయాలి



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీసీలందరికీ ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం వర్తింపజేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి బందారి బాల్‌రెడ్డి కోరారు. ఎల్లారెడ్డిపేటలో శనివారం విలేకరులతో మాట్లాడారు. బీసీలలోని 15 ఉపకులాలకు మాత్రమే రూ.లక్ష ప్రకటించడం సరికాదన్నారు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు పొందడంలో జాప్యమవుతున్నందునా దరఖాస్తు గడవు ఈ నెల 30 వరకు పొడగించాలని కోరారు. రామోజీ సత్యనారాయణ, సంతోష్, రమేశ్, రవి, కిషన్, రాజేందర్,ప్రవీణ్, శంకర్, బాల్‌రాజు పాల్గొన్నారు.

పోతుగల్‌కు బస్సు సర్వీస్ పునరుద్ధరించాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): సిరిసిల్ల నుంచి పోతుగల్ మీదుగా ముస్తాబాద్ ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ ఆర్టీసీ అధికారులకు శనివారం విన్నవించారు. రాళ్లపేట నుంచి ముస్తాబాద్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ముగిసినందునా పునరుద్ధరించాలని కోరారు. ఈ బస్సులో కూలీలు, విద్యార్థులు, మహిళలు నిత్యం ప్రయాణం చేస్తారని, వెంటనే పునరుద్ధరించాలని కోరారు.